www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 19 నవంబర్ 2024

5

అన్నమయ్య

బీచ్ వాలీబాల్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - నందలూరు

బీచ్ వాలీబాల్ అండర్-19 బాలుర, బాలికల జట్టును నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని చెయ్యేరు నది ఒడ్డున ఎంపిక చేసినట్లు అండర్-19 జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఎంపికలో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. బాల, బాలికలలో ఇద్దరు క్రీడాకారులు మెయిన్ టీంనకు ఎంపిక చేశామని తెలిపారు. స్టాండ్ బైగా రెండు టీంలకు నలుగురిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23, 24వ తేదీలలో బాపట్లలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. బీచ్ వాలీబాల్ పోటీలకు టంగుటూరు ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు సెలెక్టర్‌గా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో పిఇటి జగన్, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

వంటింట్లో ధరల మంట

- చుక్కల్లో కూరగాయలు, నిత్యావసర ధరలు
- ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇస్తున్న ప్రభుత్వం
- ధరల నియంత్రణ పట్టని వైనం
- ఎన్నడూ లేని విధంగా పెరిగిన ఆయిల్ ధరలు
- ఉల్లి, వెల్లుల్లి, టెంకాయల ధరలు పైపైకి
- ఆందోళనలో నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు

ప్రజాశక్తి-పుల్లంపేట

నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. సామాన్యుడు ఏదీ కొనలేని పరిస్థితి. ఏ దుకాణానికి వెళ్లినా ధరల భారం తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తూ పథకాన్ని ప్రారంభించింది. వంట చేసుకునే నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో మాత్రం ఘోరంగా విఫలమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. వంట నూనె ధర రెండు నెలల్లో రూ.40 వరకు అధికంగా పెరిగింది. కూటమి సహకారంతో ఏర్పాటైన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడం కూడా దీనికి కారణమని చెప్పొచ్చు. ఉల్లి ధర రూ.80కి ఎగబాకింది. కార్తీక మాసం కావడంతో టెంకాయ ధర కూడా ఎన్నడు లేని విధంగా రూ.40కి చేరింది. నిత్యావసర సరుకుల ధర పెరగడంతో సామాన్యులు బిక్కమొహం వేశారు. కూరగాయల ధరలు పప్పులు, నూనె, బియ్యం ఇలా ఒక్కటేమిటి దేనిని పట్టుకున్నా షాక్ కొట్టిందా పరిస్థితి ఉంది. పిల్లల చదువులు, ఇంట్లో నిత్యావసర సరుకులు, ఇంటి కిరాయిలు ఇతర ఖర్చులకు అరకొర సంపాదించే సామాన్యుడి జీతం నెల తిరిగేసరికి ఆవిరైపోతుంది. ఇక దినసరి కూలి సంగతి సరేసరి. నిత్యావసర సరుకులు పెరుగుదలపై ప్రభుత్వం నియంత్రణ లేకపోవడంతో ఇష్టారీతిగా సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా సామాన్యుడు పెరిగిన ధరలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

పెరిగిన నిత్యావసర ధరలు ఇలా...

- సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.140
- పామాయిల్ రూ.120
- కందిపప్పు రూ.190
- మినపప్పు రూ.160
- చింతపండు రూ.140
- వెల్లుల్లి రూ.400
- టమాటా రూ.80
- ఉల్లిపాయలు రూ.60
- బంగాళదుంప రూ.80
- వంకాయ రూ.80
- అల్లం రూ.150
- చిక్కుడు, క్యారెట్ రూ.80

తలకిందులవుతున్న కుటుంబ బడ్జెట్

కొంత కాలంగా పెరిగిన ధరలు ఇతర వ్యయాలతో కుటుంబ బడ్జెట్ తలకిందులవుతుంది. ఉప్పు, కిరాయిలు, పాలు, చక్కెర, పప్పులు, బియ్యం, కూరగాయలు ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యుల నోట మాట రావడం లేదు. ప్రస్తుతం లీటర్ నూనె ప్యాకెట్‌పై ఏగంగా రూ.20 నుంచి రూ.45 పెరిగింది. బియ్యం ధరలు క్వింటాల్ రూ.300 నుంచి రూ.500 పెరిగాయి. ఇక పప్పుల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలతో నిరుపేద మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. సరుకుల ధరలతో పాటు కూరగాయల ధరలు సైతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

వ్యాపారం అంతంత మాత్రమే

ధరలు పెరిగిపోవడంతో అర్ధకిలోతో ఉంటున్నామని ఓ పక్క ప్రజలు అంటుంటే మరోపక్క ధరలు పెరగడంతో వ్యాపారం లేదని షాప్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర కొనుగోళ్లతో ప్రజలు సర్దుకుపోతుంటే వ్యాపారం లేక దుకాణాదారులు నష్టపోతున్నారు. ఒకప్పుడు కిటకిటలాడిన మార్కెట్లు కిరాణా షాపులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ఒకవేళ ఎవరైనా వచ్చినా అరకొరగా సరుకులు తీసుకెళ్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. అధిక ధరలకు కొని తెచ్చుకుంటున్నావని పూర్తిస్థాయిలో కొనుగోలు లేక సరుకు పాడవుతుందని ఫలితంగా నష్టాలను చెవి చూస్తున్నామని వారు ఆపోతున్నారు.

'ఆశా'లకు అదనపు పనిభారం ఆపాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సిఐటియు నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆశావర్కర్ల చేత అదనపు పనులు చేయించరాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. సోమవారం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఆశా వర్కర్ల మీద కింది స్థాయి అధికారుల వేధింపులు తీవ్రం కావడం వెనుక జిల్లా వైద్యాధికారుల అలసత్వం నిర్లక్ష్యమేనన్నారు. సిహెచ్‌ఒ పిహెచ్‌సిలో ఆశాలకు ఆన్‌లైన్ ఓపి డ్యూటీ వేసి వేధిస్తున్నారని, చేయలేమన్న వర్కర్లను డ్యూటీ మానెయ్యమని లేదా విధుల నుంచి తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అదనపు పనులు చేయిస్తున్నారని తెలిపారు. మిషన్ ఇంద్ర ధనస్సు, హౌస్‌హోల్డ్ సర్వే సంబంధించిన ఫార్మాట్స్ ఇవ్వకుండా ఆశాల చేత జిరాక్స్ ఖర్చు చేయిస్తున్నారని వాపోయారు. రికార్డ్స్ ప్రభుత్వం సరఫరా చేయడలేదని ఒక్కో ఆశా రూ.1500 నుండి రూ. 2300 వరకు ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మీటింగ్‌లకు హాజరయ్యే ఆశాలకు జిరాక్స్ ఖర్చులు అధికమవుతున్నాయని, వచ్చే వేతనం చాలడం లేదని వాపోయారు. ఇక జీవనం ఏ విధంగా నెట్టుకురావాలో ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. జయమ్మ, యస్. మెహరాజున్నీసా మాట్లాడుతూ గత సమ్మె సందర్భంగా వైసిపి ప్రభుత్వం ఆశాలకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ.60 వేలు, మెటర్నిటీ లీవులు, సంక్షేమ పథకాల అమలు, చనిపోతే మట్టి ఖర్చులకు రూ.20 వేలు వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంపు వంటి అంశాలు కచ్చితంగా అమలు చేస్తామని మినిట్స్‌లో పొందు పరిచారని చెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి వెంటనే జిఒలు విడుదల చేసి అమలు చేయాలని కోరారు. నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని టిఎ, డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా వైద్యాధికారి కొండయ్యతో ఆశాల సమస్యలపై జాయింట్ మీటింగ్ ఏర్పాటుకు ఆదేశించారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఆశాలు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లావణ్య, రమా మణి, గాయత్రి, సుధా మణి,చెంగమ్మ,ఓబుళమ్మ, గంగాదేవి, రాములమ్మ, శ్యామల, నందిని, చంద్రకళ,అనిత, సరోజ, మంజుల పద్మ, నిర్మల, షాహీద పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం : కలెక్టర్

అర్జీలదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఒ కె. మధుసూదన్‌రావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య, ఆర్‌డిఒ శ్రీనివాస్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం కావాలన్నారు. అర్జీదారుల సమస్యలను అత్యంత నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఎప్పుడు వచ్చాయి, ఫీల్డ్‌కు వెళ్లారా, విచారణ చేశారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న అంశాలలో అధికారులతో కలెక్టరు సమీక్షించారు. సమస్య వచ్చిన మరుసటి రోజు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయాలన్నారు. అర్జీదారులతో కలిసి ఫొటో దిగాల న్నారు. జిల్లా అధికారులందరూ కూడా వారి శాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడూ నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

29న టౌన్ బ్యాంక్ ఎన్నికలు

షెడ్యూలు విడుదల చేసిన ఎన్నికల అధికారి దుర్గమ్మ

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్‌లో ఈ నెల 29న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు టౌన్ బ్యాంక్ ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ చెప్పారు. సోమవారం స్థానిక సిటిఎం రోడ్డులోని టౌన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 12 మంది డైరెక్టర్ల ఎంపిక జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పాల్గొనే వారు ఎస్‌సి, ఎస్‌టిలు రూ.200, బిసిలు రూ.400, ఇతరులు రూ.వెయ్యి నామినేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఏ క్లాసు సభ్యులు బ్యాంక్‌లో ఐడెంటిటీ కార్డులు పొందాలన్నారు. 22న నామినేషన్లు స్వీకరణ, 23న నామినేషన్లు పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం సాయంత్రం 5 గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితా ఎన్నికల గుర్తుల కేటాయింపు ఈ కార్యక్రమం అంతా బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక 12 మంది మాత్రమే మిగిలితే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తామన్నారు. లేని పక్షంలో ఎన్నికలు 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బెంగళూరు రోడ్(సొసైటీ కాలనీ క్రాస్)లోని నెహ్రూ పురపాలక ఉన్నత పాఠశాలలో 12 మంది సభ్యుల ఎంపికకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. సిఇఒ పి.వి.ప్రసాద్ మాట్లాడుతూ గుర్తింపు కార్డులులేని ఎ-క్లాసు మెంబర్లు వెంటనే 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు బ్యాంక్‌లో సమర్పించి గుర్తింపు కార్డు పొందాలని తెలిపారు.

మాట్లాడుతున్న ఎన్నికల అధికారి దుర్గమ్మ

108ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న 108 సిబ్బంది

108 సర్వీస్‌లో పనిచే స్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక 108 పైలెట్లు అమరనాథ్ బాబు, రెడ్డి రాజ, ఇఎంటిలు సుబ్రహ్మణ్యం, సంస్కృతిలు అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ పామిలేటి, ఎంపిడిఒ మనోహర రాజు, ఎస్ఐ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 అత్యవసర సర్వీసు నిర్వహించే పైలెట్లు, ఇఎంటిల వేతన స్లాబ్స్‌ని అప్డేట్ చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా వేతన స్లాబ్స్ అప్డేట్ చేయకపోవడం దారుణమన్నారు. 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, 8గంటల పని విధానం అమలు చేయాలన్నారు. అంతర్ జిల్లా ట్రాన్స్‌ఫర్లు నిలిపేయాలని, చనిపోయిన ఉద్యోగులకు రూ.20లక్షల భీమా కల్పించాలన్నారు. టిడిపి ప్రభుత్వం ఇచ్చిన జిఒ ఎం.ఎస్.49 ద్వారా నెలకు రూ.4 వేలు ఇచ్చేదని, గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పిఎఫ్ సొమ్ము మొత్తాన్ని యాజమాన్యం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. **సుండుపల్లి** : మండలంలోని 108 ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు తమ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనందును తాము నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు సోమవారం తహశీల్దార్ క్రాంతికుమార్‌కు వినతి పత్రంం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో ఈనెల 15 నుంచి సమ్మె నిర్వహిస్తామన్నారు. రాత్రకన, పగలనక ఎప్పుడు పడితే ప్రజలకు ఇబ్బంది రోగులకు ఇబ్బంది ఉంటే ఫోన్ కొడితేనే వెంటనే స్పందించి వారిని తక్షణమే ఆస్పత్రిలో చేర్పించే సిబ్బందికి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రోజుకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, రావాల్సిన ఇంక్రిమెంట్లు, సెలవులు, వేతనాలు వెంటనే చెల్లించాలని 108 ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో పైలట్ ప్రసాద్, ఇఎంపి పెంచలయ్య, ఉద్యోగులున్నారు.

రెడ్డయ్య మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) జిల్లా మాజీ అధ్యక్షులు, సిపిఐ సీనియర్ నాయకులు రెడ్డయ్య మరణం చాలా బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. విద్యార్థి ఉద్యమంలో తనకు సహచరుడుగా రాజంపేట ప్రాంతం నుండి అనేక విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. 1993లో మైదుకూరులో జరిగిన ఎఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభల్లో కడప జిల్లా అధ్యక్షులుగా రెడ్డయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాను ఎన్నికై విద్యార్థుల సమస్యలపై వీరోచిత పోరాటాలు నిర్వహించామని పేర్కొన్నారు. 1995లో రాజంపేటలో జరిగిన మహాసభలలో ఎఐఎస్‌ఎఫ్ నుండి రెడ్డయ్య రిలీవై రాజంపేట భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కార్మిక, యువజన, మహిళా సంఘాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. సామాన్య ప్రజలు, కార్మికులు, యువకులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం చాలా బాధాకరమని తెలిపారు. ఆయన మృతి పట్ల సానుభూతి తెలియజేశారు.

'పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి'

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని పశువులకు వందశాతం బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ సమావేశ హాల్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 'జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి' సంబంధించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువులలో బ్రూసెల్లోసిస్ వ్యాధిని నిర్మూలించి ఆర్థిక ప్రగతిని సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెప్పారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని, నివారణకు టీకాలు ఒకటే మార్గమని చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పశు వైద్యశాలల్లో లేదా పశుపోషకుని ఇంటి వద్దనే సంవత్సరానికి మూడు విడతలుగా ఉచితంగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధిక టీకాలు వేయాలని సూచించారు. 4-8 నెలల వయసు గల పెయ్య దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. వ్యాధి లక్షణాలు వ్యాధి వ్యాప్తిపై పాడి రైతులకు, పశు యజమానులకు పూర్తిగా అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మధుసూదన్ రావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య, ఆర్‌డిఒ శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కనకదాసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

భక్త కనకదాసు చూపిన బాటలో నడుద్దాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

భక్త కనకదాస చూపిన బాటలో నడుద్దామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం భక్త కనకదాసు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో కనకదాస చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్త కనకదాస, సామాన్యులకు అర్థమయ్యే విధంగా కన్నడ భాషలో రచనలు, కీర్తనలు రాసి కృష్ణుడి భక్తుడయ్యారన్నారు. ఆయన తన రచనల ద్వారా సమ సమాజ నిర్మాణానికి దోహదం చేశారన్నారు. ఆయన చూపిన బాటలో మనమందరం నడవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. భారతీయ తత్వవేత్త, కవి, సంగీతకారుడు, స్వరకర్త అయిన కనక దాసు కర్ణాటక సంగీతం కోసం ఎనలేని సేవ చేశారన్నారు. కర్ణాటకలో జన్మించిన ఆయన మంచి విద్యావంతులుగా సమాజాన్ని అన్నికోణాల్లో సూక్ష్మ పరిశీలన చేశారన్నారు. చిన్న వయసులోనే నరసింహ స్తోత్రం, రామ ధ్యాన మంత్రం, మోహన తరంగిని అనే కవిత్వాలను రచించారన్నారు. సాధారణ కన్నడ భాషలో కనకదాసు ఎన్నో కీర్తనలను రచించి ఆలపించారన్నారు. కీర్తనలు రచిస్తూ.. వేదంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడిగా ఆయన పేరు గడించారన్నారు. కనకదాసు సైన్యంలో కూడా పని చేసినట్లు అతని కీర్తనలు ఆధారంగా తెలుస్తోందన్నారు. ఒకసారి యుద్ధంలో తీవ్రంగా గాయపడిన కనకదాసు అనూహ్య రీతిలో ప్రమాదం నుండి తప్పించుకుని, ఆ తర్వాత సైన్యం నుండి బయటకు వచ్చి తత్వ జ్ఞానాన్ని అలవరచుకుని కృష్ణ భక్తుడిగా సుప్రసిద్ధులయ్యారన్నారు. కురవ కులానికి చెందిన కనకదాసు కూడా.. అప్పట్లో కుల వివక్షతను ఎదుర్కొన్నారన్నారు. అయితే.. అయిన భక్తికి మెచ్చిన ఆ కృష్ణ భగవానుడే సాక్ష్యాత్తు ఆయనకు ఆలయ ప్రవేశం సుగమం చేయడంతో.. కనకదాసు భక్తి సమాజంలో ప్రసిద్ధిగాంచిందని.. భక్త కనకదాసు చరితాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సందప్ప, కురుబ సంఘ నాయకులు బండి రెడ్డప్ప, శివ, న్యాయవాది ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రజలలో మమేకమవుతూ, వారికి అండగా ఉంటామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం జగనన్న కాలనీలో వైసిపి నాయకులు రఫీ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం నోముల పండుగను పురస్కరించుకొని చిప్పిలి మల్లికార్జున రెడ్డి ఆహ్వానం మేరకు కార్తీక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికి, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు, కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వైసిపికి ప్రజలను చేరువ చేయాలని పిలుపునిచ్చారు. వైసిపిని అధికారంలోకి తీసుకువచ్చి జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేయడానికి తామంతా కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏకార్యకర్త అధైర్యపడొద్దని, ప్రతి కార్యకర్తకు తాము అండగా వుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, జెసిఎస్ కన్వీనర్ అనంత మునిశేఖర్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నిస్సార్ అహమ్మద్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

మదనపల్లెను ఐటి హబ్‌గా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెను ఐటి హబ్‌గా తీర్చిదిద్దడమే తనముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్ బాష స్పష్టం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో ఎపి అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన అనుభవంతో రాష్ట్రాన్ని చక్కదిద్దుతూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ఆంధ్రుల జీవనాడైన పోలవరాన్ని త్వరితగతిన పూర్తిచేసి రాయలసీమకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యమన్నారు. బెంగళూరు-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు మదనపల్లె నియోజకవర్గం దగ్గరగా ఉండడంతో దీనిని దృష్టిలో ఉంచుకొని ఐటి హబ్‌గా అభివృద్ధి చేసి యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడానికి కార్యాచరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. మదనపల్లె అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సిటిఎం రోడ్డు నుండి ఆర్‌టిసి బస్టాండ్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి వేయడానికి రూ.12 కోట్లతో నివేదికలు సిఎం వద్దకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. సిఎం సానుకూలంగా స్పందించి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నిధులు వచ్చిన వెంటనే రోడ్లు, బ్రిడ్జిలు, పట్టణ, నియోజకవర్గం అభివృద్ధికి అన్ని రకాల చర్యలు చేపడతామన్నారు. హార్సిలీహిల్స్, మదనపల్లి పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. నిరంతరం ప్రజాశ్రేయస్సు కోసమే పనిచేస్తున్నామని, అర్థరహితమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాదెండ్ల విద్యాసాగర్, నాగూర్ వలి, షంషీర్, ఎస్.ఎ.మస్తాన్‌ఎస్. ఎం.రఫీ, రాటకొండ గుర్రప్ప నాయుడు, రామిశెట్టి నీలకంఠ, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, నవీన్ చౌదరి, రాటకొండ మధుబాబు, నాదెళ్ల శివన్న, కమలామ్రి కృష్ణ, బొమ్మిశెట్టి పురుషోత్తం, మోడెం సిద్ధప్ప, బీదం గురునాథ్ యాదవ్, యర్రబెల్లి వెంకటరమణారెడ్డి, మాకినేని చంద్రశేఖర్, చల్లా నరసింహులు, పెంచుపాడు స్వామి, మధుసూదన్‌రెడ్డి, వేణు, బాబా పాల్గొన్నారు.

కడపలో రామ్‌చరణ్ సందడి

పెద్దదర్గా సందర్శన
సాదరంగా ఆహ్వానించిన దర్గా కమిటీ సభ్యులు
పూల చాదర్‌ను సమర్పించిన రామ్‌చరణ్
విజయదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తున్న రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో సోమవారం గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ సందడి చేశారు. పెద్దదర్గా సందర్శనలో భాగంగా ఆయన కడపకు విచ్చేశారు. రామ్‌చరణ్ వస్తారనే వార్త తెలియగానే కడప ఎయిర్‌పోర్టు వద్ద అభిమానులు, ప్రజలు గుమ్మిగూడారు. బేగంపేట నుంచి కడప ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో వచ్చిన రామ్‌చరణ్ రాత్రి పెద్దదర్గాను సందర్శించారు. దర్గా కమిటీ నిర్వాహకులు ఆయనకు సాదరంగా ఆహ్వానం పలికారు. పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని స్వాగతం పలికారు. దర్గాలో పూల చాదర్ సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి దర్గా విశిష్టితను రామ్‌చరణ్‌కు వివరించారు. ఆయనతోపాటు దర్శకుడు బుచ్చిబాబు ప్రార్థనలు చేశారు. అభిమాన హీరోను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో దర్గాకు చేరుకున్నారు. పోలీసు బందోబస్తు నడుమ రామ్ చరణ్ పర్యటన కొనసాగింది.

విజయదుర్గా దేవి ఆలయంలో పూజలందుకుంటున్న రామ్‌చరణ్

విజయదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

రామ్ చరణ్ ముందుగా శ్రీ విజయ దుర్గా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహకులు దుర్గాప్రసాద్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి పెద్ద దర్గా కు బయలుదేరి వెళ్లారు. ముందుగా ఎయిర్‌పోర్టు నుంచి అభిమానులు బైక్ ర్యాలీ తో ఘన స్వాగతం పలికారు. దారి వెంబడి అభిమానులుబాణా సంచా పేల్చి, పూల వర్షం కురిపించారు. ఆయనతోపాటు ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు వచ్చారు. రామ్‌చరణ్ చూడడానికి ఆలయ ప్రాంగణానికి అభిమాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మదనపల్లె : వ్యాసరచన పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

కురబలకోట శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాచరచన పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్య కథ వ్యాచరచన పోటీలు, మహిళ దినోత్సవం సాధికారత చర్చ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ అహ్మద్ రఫీ, ఉపాధ్యాయులు కె.జనార్ధన్, బి.రమేష్, ఎస్ .అమ్మా జాన్, తాజ్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు కలకడ గ్రంథాలయ శాఖ అధికారి అమరనాథ తెలిపారు. విద్యార్థులకు స్థానిక కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీలను ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈ నెల 20వ తేదీన ముగింపు కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు, బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. తంబళ్లపల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తంబళ్లపల్లెలో ఆదర్శ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రధాన ఉపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపిపి స్కూల్ విద్యార్థులకు మ్యూజిక్ చైర్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్ కుమార్, గ్రంథాలయ అధికారి జిలానిబాషా, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** పుస్తక పఠనంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు సోమవారం మనిషా విద్య నికేతన్‌లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాలని రోజూ వివిధ పుస్తకాలు చదివితే జ్ఞానం పెరుగుతుందని చెప్పారు. గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఉదయ్ కుమార్, విద్యానికేతన్ కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి పాల్గొన్నారు. **గాలివీడు :** పిల్లల్లో నైపుణ్యత వెలికి తీయడానికి డ్రాయింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గేశ్వరరాజు పేర్కొన్నారు. సోమవారం 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు సుమారు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రామచంద్రనాయక్, కుందా లక్ష్మీ ప్రసన్న, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు:** గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం పీలేరు ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టు కుంది. స్థానిక జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.సురేంద్రరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పద్యకవి జలకనూరి మురళీధర్ రాజు, ఇతర కవులు సరస్వతి శ్రీరాములు రాజు, భాస్కర్, నరసింహులు, షేక్ షాహిద్ పాల్గొని తమ పద్యాలు, కవితలతో అందరిని మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా పిల్లలందరూ సభ్యత్వం తీసుకోవాలిని సూచిస్తూ పిల్లలను ఉత్తేజ పరుస్తూ సంభాషణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథయాధికారి అమరనాథ్, బిడిసి పి. మంజుల, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గాలివీడు : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గవర్నర్‌గా ప్రమాణం చేస్తున్న యశస్వి

వాసవి క్లబ్ గవర్నర్‌గా యశస్వి ప్రమాణం

ప్రజాశక్తి-పీలేరు

వాసవి క్లబ్స్ టర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి211ఎ-2025 గవర్నర్‌గా మునగాల తేజ యశస్వి గుప్త ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం రాత్రి పీలేరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమిశెట్టి లీలా సురేష్ సంబరాలు డిస్టిక్ కానారేన్స్ వైభవంగా జరిగాయి. ఈ సమావేశంలో సభాధ్యక్షులు జిల్లా గవర్నర్ సురేష్, ఐఐసి మెంబర్స్, వైస్ గవర్నర్స్, క్యాబినెట్ మెంబర్స్, రీజియన్ చైర్పర్సన్స్, జోన్ చైర్పర్సన్స్, డిస్టిక్ ఆఫీసర్స్, జిల్లాలోని అన్ని క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, వందలాది వాసవియన్స్, ఇతర సభ్యుల ఆధ్వర్యంలో వాసవియన్స్ హర్షధ్వానాల మధ్య ప్రమాణ స్వీకారం చేయించారు. 2025 గవర్నర్ తేజ మాట్లాడుతూ క్యాబినెట్ ని ప్రకటించి సభకు పరిచయం చేస్తూ, తిరుపతిలో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి నడయాడిన ప్రదేశంలో ఆర్యవైశ్య నాయకులు ప్రమాణస్వీకారం చేసి సమాజ సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. 2025లో 25 ముఖ్య కార్యక్రమాలతో డిస్టిక్ వి211ఎకి వైభవం తీసుకొస్తానని, 2025 వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ అంతర్జాతీయ అధ్యక్షులు ఇరుకల రామక ృష? సారథ్యంలో డిస్టిక్ వి211ఎ సర్వతోముఖాభివ ృద్ధికి శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులు, వాసవి మాత సంపూర్ణ కృపతో వాసవియన్ల ఉద్యమంలో 8 సంవత్సరాల అనుభవంతో మీకు సేవలు అందిస్తానని, చేయి చేయి కలుపుదాం సేవ చేయక కదులుదామనే నినాదంతో మీ అందరి సహాయ సహకారాలతో శుభాశీస్సులతో డిస్టిక్ వి211ఎని ముందుకు తీసుకెళ్తానని సభాముఖంగా తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ హెచ్ఎస్ నాగభూషణ, అంతర్జాతీయ కార్యదర్శి, అబ్జర్వర్ శ్రీనివాసులు, ఐఐసి ఆఫీసర్, డిస్టిక్ ఎలక్షన్ ఆఫీసర్వె వెలవలూరి వెంకటేష్ బాబు, కమిటీ సభ్యులు ఇసా నాగలక్ష్మి, సోమిశెట్టి సురేష్ బాబు, జిల్లాలో ఏకగ్రీవ నామినేషన్ ద్వారా ఎన్నికైనట్లు తెలియజేశారు. ఫాస్ట్ గవర్నర్ ముల్లంగి విజయ్ కుమార్, ముద్వల నరసింహులు శెట్టి, ఆర్యవైశ్య సంఘ నాయకులు, జిల్లా నాయకులు, క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, వాసవియన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఎఎస్‌పి ఎం.వెంకటాద్రి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదుదారుల సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా అదనపు అడ్మిన్ ఎం.వెంకటాద్రి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయానికి రాలేని వారు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సకాలంలో న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులు తప్పకుండా ఆధార్ కార్డు జిరాక్స్‌ను వెంట తీసుకురావాలని తెలిపారు.

విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం

ప్రజాశక్తి-పీలేరు

సమాజంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల విద్యా వ్యవస్థలో మార్పులు అవసరమని అపుస్మా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు విఆర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం పీలేరు పట్టణ శివారులోని చిత్తూరు రోడ్డులో ఉన్న శ్రీ భువన విద్యాలయంలో పీలేరు నియోజక వర్గ ఎపిపియుఎస్ఎంఎ అధ్యక్షులు వి.శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా ఎపిపియుఎస్ఎంఎ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు విఆర్.రెడ్డిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలు, పిల్లల విద్యా వ్యవస్థపై రావాల్సిన మార్పులపై ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎపిపియుఎస్ఎంఎ గౌరవ అధ్యక్షులు రఘునాథ రెడ్డి, మెంటర్ ఆదినారాయణ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, పీలేరు నియోజక వర్గ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు ఉమా రమాదేవి, వడ్లమూడి మాధవి, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విఆర్ రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

కవి వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారి విజయ్ కుమార్

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

- ప్రముఖ కవి వేంపల్లి అబ్దుల్ ఖాదర్

ప్రజాశక్తి-కలికిరి

పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని, మాతృభాషను ఆస్వాదించగలిగితే ఎన్నో ప్రయోజనాలుంటాయని ప్రముఖ కవి వేంపల్లి అబ్దుల్ ఖాదర్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి విజయకుమార్ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ కవి వేంపల్లి అబ్దుల్ ఖాదర్ విద్యార్థులు, పాఠకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితం పరిపూర్ణం కావాలంటే అందులో పుస్తకం ప్రాధాన్యం ఎంతైనా ఉందన్నారు. ఒక పుస్తకం చదివితే మానసిక ప్రశాంతత, జ్ఞానం, పొందవచ్చని, భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చని దానికి వారధి లాగా గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. పుస్తకం విలువ గురించి మాట్లాడుతూ మనిషి ఎవరూ లేని దీవిలో ఒంటరిగా వదిలి పెట్టి నాలుగు పుస్తకాలు ఇస్తే వాటిని చదివి రెట్టింపు ఉత్సాహంతో వస్తానని నెహ్రూ మాటలు గుర్తు చేశారు. మహాత్మా గాంధీని కోటి రూపాయలు ఇస్తే ఏం చేస్తారన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఒక మంచి లైబ్రరీను నిర్మిస్తానన్నారు. గుడిని నిర్మించడం వలన బిచ్చగాళ్లను తయారు చేస్తే గ్రంథాలయాన్ని నిర్మించడం వలన మేధావులు తయారవుతారని అంబేద్కర్ అన్నాడని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులకు నేటి సమాజంలో లోపేస్తున్న మానవతా విలువలను గురించి, విద్యార్థి దశలో చేయాల్సిన కృషిని గురించి చాలా చక్కగా వివరించారు. విద్యార్థులకు ఆయన రచించిన మెతుకు అనే పుస్తకాన్ని బహుకరించాడు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంద్రమ్మ కాలనీ హెచ్‌ఎం సంపత్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులు జీవితాల్లో నింపే వెలుగులు, జ్ఞానాన్ని ప్రసాదించే విజ్ఞాన భాండాగరాలుగా అభివర్ణించారు. ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం మురాధ్న మాట్లాడుతూ ఆయన చిన్నతనంలో గ్రంథాలయానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని చేసుకున్నారు. తదనంతరం కవి వేంపల్లి అబ్దుల్ ఖాదర్ ను గ్రంథాలయ అధికారి దృశ్యాలతో సత్కరించారు. కార్యక్రమానికి సికామ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

ఇళ్ల స్థలాలు కేటాయించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్మికులుగా పనిచేస్తున్న తమకు గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలను కేటాయించాలని క్లీన్ ఫుడ్స్ కార్పొరేషన్ కార్మికులు సోమవారం తహశీల్దారు ఖాజాబీకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995లో చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో క్లీన్ ఫుడ్స్‌లో పనిచేస్తున్న 285 మంది కార్మికులు ఇంటి స్థలాల కోసం అప్పటి సబ్ కలెక్టర్‌ను కలవగా వలసపల్లె పంచాయితీ లోని సర్వే 496-1, 816/1లో ఇంటి పట్టాల కోసం ఐదెకరాలు కేటాయించారన్నారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో అప్పట్లో ఇళ్లు నిర్మిమచుకోలేక పోయామన్నారు. తరువాత కాలంలో అధికారులు ఇళ్లు నిర్మించుకోవాలని నోటీసులు ఇవ్వడంతో లబ్ధి దారులందరూ కలిసి మాకు కేటాయించిన స్థలాన్ని లక్షలు ఖర్చు చేసి చదును చేసుకొన్నామని తెలిపారు. తమకు కేటాయించబడిన ప్లాట్లను ఇంతవరకు చూపలేదని వాపోయారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషను కలిసి తమ పరిస్థితిని తెలియజేయగా ఆయన తహశీల్దారును కలవమనడంతో వచ్చి కలిసినట్లు తెలిపారు. తమ స్థలాల కేటాయింపుకు తహశీల్దారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మల్లయ్య కొండకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంభికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం మూడవ సోమవారం కావడంతో భక్తులు మల్లయ్య కొండపై కేదారేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించి నోములు నోచుకున్నారు. పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తుల సౌకర్యార్థం మల్లయ్య కొండపైకి ఆర్‌టిసి సంస్థ రెండు బస్సులను ఏర్పాటు చేశారు. మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి కొండపై అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఇఒ మునిరాజు, కొండకిట్టాలు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి : సిఐ

ప్రజాశక్తి-చిన్నమండెం

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలని రూరల్ సిఐ వరప్రసాద్ అన్నారు. సోమవారం ఆదర్శ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కావలసిన సామాజిక భద్రత-ఉన్నత భవిష్యత్ ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార దశలో విద్యార్థినులు లోనయ్యే సామాజిక సమస్యలు, సామాజిక స్పృహ, తోటి విద్యార్థులు ఎలా మెలగాలి, పాఠశాల, కళాశాలలో ఉపాధ్యాయులతో సత్ సంబంధం, ఉన్నత ఆశయాలు లక్ష్యంగా ఏర్పరచుకుని ప్రణాళిక బద్ధంగా చదివితే అనుకున్న విద్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ఉపాధి, వివాహం, కుటుంబ వ్యవస్థలు, బలపడి సమాజ శ్రేయస్సు చేకూరుతుందని సూచించారు. చెడు అలవాట్లు, మత్తు పానీయాలకు బానిసలై తమ వ్యక్తిగత జీవితాలను విద్యార్థులు నాశనం చేసుకోవద్దని సూచించారు. దిశ అప్ ద్వారా విద్యార్థినులకు సామాజిక భద్రత ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, ఎన్ఎస్ఎస్‌పిఒ నవీన్ కుమార్, సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా రాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట.

E. A. No. 56/2022 in
E.P.No. 27/2017 in
O.S.No. 13/2006

పి.చంద్రశేఖర్ రెడ్డి, తండ్రి శేషారెడ్డి పెనగలూరు గ్రామం మరియు మండలం అన్నమయ్య జిల్లా.

...Petitioner /D.Hr

Vs

పుట్టం రెడ్డి వెంకట కుమార్ రెడ్డి, తండ్రి వెంకటరమణారెడ్డి పెనగలూరు గ్రామం మరియు మండలం అన్నమయ్య జిల్లా.

...Respondent /Jproposed J.Dr No. 3

పైన తెలిపిన పిటిసినరు మిమ్మల్ని పుట్టంరెడ్డి శారదమ్మ వారసులుగా మూడవ J.Dr చేర్చమని పైకోర్టులో పై పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల స్వయంగా గాని లాయర్ ద్వారా గాని పై కోర్టులో 04.12.2024 తేదీన ఉదయం 10:30 కు హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షంగా తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్ //
V. గురు ప్రతాప్ కుమార్ రెడ్డి
అడ్వకేట్,
రాజంపేట.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, రాజంపేట

O.S.No. 115/2007

యం.యస్.నాయుడు died his LRs
యం సుశీలమ్మ & ఇతరులు, అందరూ హిందూ, నివాసం నూనెవారిపల్లి, రాజంపేట, అన్నమయ్య జిల్లా.

...ప్లెయింటిఫ్

వర్సెస్

13.మునక్కాయల మురళి మోహన్ రెడ్డి తండ్రి రామచంద్రా రెడ్డి, పోలి గ్రామము, రాజంపేట మండలం , అన్నమయ్య జిల్లా.

...D-13

పై తెలిపిన వాదులు, మిమ్మలని 13వ ప్రతివాది/D13 గా చేర్చమని కోరుచూ పైకోర్టులో పై దావా దాఖలు చేసి యున్నారు మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న ఎడల 22.11. 2024 తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
మూరి గోవర్ధన్ రెడ్డి
అడ్వకేట్,
రాజంపేట

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పోతుగుంట రమేష్ నాయుడు

విద్యార్థులకు అతిథి భోజనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని డిబిఎస్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్వర్ణలత అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, విశ్రాంత ఎంఇఒ నిర్మల హాజరై మాట్లాడారు. ఇళ్లల్లో పుట్టినరోజు, శుభకార్యాలు నిర్వహించుకునే ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అని అన్నారు. సమాజంలోని సేవా తత్పరులు ఇటువంటి కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో వెలసి ఉన్న శివా లయం వద్ద కార్తీక మాసం మూడవవారం పురస్కరించుకొని చిన్నంపల్లి గ్రామా నికి చెందిన చంగల్ రాజు కుమారుడు కన్నా దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించారు. ఈ సంద ర్భంగా కన్నా మాట్లాడుతూ అన్నదానం మహా పుణ్యకార్యమని కార్తీక మాసంలో భక్తులకు అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్య క్రమంలో పల్లపు జనార్ధన, కావేటి వెంకటరమణ, కృష్ణ, రవి పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక పూజలు

ప్రజాశక్తి- రామాపురం

కార్తీక మాసం మూడో సోమవారం మండలంలోని పలు శివాలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని హసనాపురంలోని గంగా భవాని సమేత మూల సంస్థానేశ్వర ఆలయం చెరువు ఘాట్ రోడ్‌లో భవన శంకరాలయం, గువ్వల చెరువు గంగనేరు, పాతమేదరపల్లె గోపగుడిపల్లి, సరస్వతి పల్లె, నీలకంఠరావుపేట, బండపల్లి, మహావిష్ణువు, రామాపురం. హరిహరాలయాల్లో ప్రజలు పూజలు నిర్వహించారు.

రూపానందరెడ్డిని ఆహ్వానిస్తున్న అధ్యక్షుడు సుబ్బ నరసారెడ్డి

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి 'ముక్కా'కు ఆహ్వానం

ప్రజాశక్తి-పుల్లంపేట

రాజంపేటలో జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డికి సోమవారం పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సంఘం అధ్యక్షుడు మల్లుసుబ్బ నరసారెడ్డి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై, ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తున్న రూపానందరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమానికి రూపానందరెడ్డి కచ్చితంగా హాజరవుతానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుణశేఖర్, పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు ఖాధర్ భాష, సెక్రటరీ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రామాపురం

అర్హులైన లబ్ధిదారులు పిఎంఎవై పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ ప్రసాద్ తెలిపారు స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులు పిఎంఎవై పక్కా గృహాలకు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బూర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.విద్యార్థి దశ నుండే దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాల సంజీవు, ఉపాధ్యాయులు గాయత్రి, రెడ్డెప్ప రెడ్డి, స్కూల్ చైర్మన్ జయచంద్రా రెడ్డి, యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు విశ్వనాధ్, తదితరులు పాల్గొన్నారు.

దృష్టి లోప సమస్యలను నిర్మూలించడమే ధ్యేయం

- లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ భాస్కరాచారి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

దృష్టి లోప సమస్యలను నిర్మూలించడమే ధ్యేయమని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి అన్నారు. మదనపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో సోమవారం 28వ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ దృష్టి లోప సమస్యలను నిర్మూలించడమే లయన్స్ క్లబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ఉద్దేశం నెరవేర్చే దిశలో భాగంగా క్రమంగా కంటి పరీక్ష శిబిరాలు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ద ృష్టి లోపాలతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని, వారిని గుర్తించి మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ పర్మినెంట్ ప్రాజెక్టులో భాగంగా ఉచిత కంటి శిబిరాలు, ఆపరేషన్లు కొనసాగుతూనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిఆర్ఒ గౌతమ్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు చేసుకున్న లబ్ధిదారులు